క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



పాత గుంటూరు: విద్యానగర్ ఒకటోలైనులోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మురళీ కృష్ణమాచార్యులు స్వామివారికి విశేష పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. దేవస్థానం అధ్యక్షుడు కొల్లి బాలకృష్ణ మాట్లాడుతూ దేవస్థానంలో దశాబ్ద కాలంగా నిరంతరాయంగా ప్రతి నెల నాలుగో మంగళవారం రోజు 108 సార్లు చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఆలయ సభ్యులు బి.సత్యనారాయణశాస్త్రి, కొల్లి అనిల్ కుమార్, శ్రీమన్నారాయణ మూర్తి, కొల్లి అరవింద్, కనుకుర్తి హనుమంతరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన

నెహ్రూనగర్: విభిన్న ప్రతిభావంతుల, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల డిమాండ్ తగ్గింపు అంశంపై మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నుంచి విముక్తి కలిగించే విధంగా, దాని బారిన విద్యార్థులు పడకుండా అవగాహన కల్పించడం జరిగిందని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త తెలియజేశారు. యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.ప్రమీల, జిల్లా డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాయి కిరణ్, సైకాలజీ డిపార్ట్‌మెంట్ పీజీ మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

30న శోభ యాత్ర ర్యాలీ

గుంటూరు మెడికల్: శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ శ్రీరామనవమి శోభాయాత్ర, భారీ బైక్ ర్యాలీ బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి ప్రారంభమవుతుందని చల్లా బ్రహ్మారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పట్నంబజారులో శ్రీరామ ఉత్సవ సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు ర్యాలీలో పాల్గొని కోరారు. ర్యాలీ దేవస్థానం నుంచి ప్రారంభమై లాడ్జి సెంటర్, మార్కెట్ సెంటర్, మున్సిపల్ కార్పొరేషన్, నాజ్ సెంటర్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, పాత గుంటూరు, సంగడిగుంట, పట్నంబజారు, నగరంపాలెం మీదుగా హౌసింగ్ బోర్డ్ లోని అయ్యప్ప స్వామి గుడి వద్ద ముగుస్తుందన్నారు. ఈసమావేశంలో అడపా ఫణీంద్ర, తూనుగుంట్ల రాజేష్, వేణుగోపాల్, వనమా నరేంద్ర, లోకేష్ గుప్తా, సకలా కుమార్, హరిహర రాయలు, బండి లక్ష్మణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా 'ఐదు పదులు' నాటిక



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డి.తిరుమలేశ్వరరావు సంయుక్త నిర్వహణలో ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ప్రముఖ రచయిత కావూరి సత్యనారాయణ రచన దర్శకత్వంలో ఐదు పదులు నాటిక సందేశాత్మకంగా సాగింది. అనంతరం జరిగిన సభలో మేకల మోహనరావు కళాపోషకులు నూతలపాటి తిరుపతయ్య, ప్రముఖ రంగస్థల నటుడు డాక్టర్. దేవరపల్లి ప్రభుదాస్, ఆలయ కార్యదర్శి పూటుకూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, కవి సయ్యద్ జానీ బాషాలు ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను సత్కరించారు. కార్యక్రమాలను జి.మల్లికార్జున రావు, జీవీజీ శంకర్ పర్యవేక్షించారు.

పౌరాణిక కళాకారులకు పురస్కారాలు



పాత గుంటూరు: భారత్‌పేటలోని సేవాసదన్ కార్యాలయంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో పౌరాణిక కళాకారులకు కళాసేవారత్న పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు, కార్యదర్శి సిరిగిరి సాంబశివరావుకు ప్రఖ్యాత పౌరాణిక నాటకరంగ కళాకారుడు ఈలపాటి రఘురామయ్య కళాసేవారత్న పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సేవాసదన్ అధ్యక్షులు మిరియాల గోపీకుమార్, కళావేదిక ప్రధాన కార్యదర్శి యర్రగొప్ప నాగేశ్వరరావు, కళాకారులు ఉప్పలపాటి సైదులు, దళవాయి సుబ్రహ్మణ్యం, మేకల పురుషోత్తమప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌గ్రిడ్‌పై విస్తృత పరిశోధనలు

- ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు



సదస్సు ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, ఆంధ్రా వర్సిటీ అధ్యాపకుడు ఆచార్య భాస్కర రెడ్డి

ఏఎన్‌యూ: సోలార్ పవర్‌గ్రిడ్ అనుసంధానం అంశాలపై విస్తృతమైన పరిశోధనలు జరగాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ట్రిపుల్ ఈ (ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్) విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ అండ్ ఛాలెంజెస్ ఇన్ పవర్ సిస్టమ్ ట్రాన్సిషన్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును మంగళవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ సోలార్ పవర్ పరిజ్ఞానాన్ని, ఫలితాలను సమాజానికి చేరవేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. పవర్ సిస్టమ్ అనుసంధానం అంశాలలో అనేక సమస్యలు, సవాళ్లు ఎదురవుతాయని వాటిని అధిగమించే పరిజ్ఞానం, నైపుణ్యాన్ని ఆ రంగంలో ఉన్న నిపుణులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ అధ్యాపకుడు ఆచార్య సీహెచ్‌వీవీఎస్ భాస్కరరెడ్డి కీలకోపన్యాసం చేస్తూ మారుతున్న వాతావరణ పరిస్థితులు పవర్‌సిస్టమ్స్ పనితీరుపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. ఈ అంశాలపై పరిశోధకులు దృష్టి సారించాలన్నారు. ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఆర్ఎస్ శ్రీనివాస్‌లు సదస్సు లక్ష్యాలను వివరించారు. దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీల నుంచి అధ్యాపకులు, పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొంటున్నారని తెలిపారు. ట్రిపుల్ ఈ అధ్యాపకులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ పుణ్యశేఖర్, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ రాజాజీ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజనులతో కలసి రాజ్యాధికారమే లక్ష్యం

పాత గుంటూరు: రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజనులతో కలిసి త్వరలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రముఖ బహుజన నాయకుడు వి.జి.ఆర్ నారగోని పేర్కొన్నారు. మంగళవారం పాత గుంటూరు నాయీ బ్రాహ్మణ సామాజిక భవనంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణ రాజకీయ చైతన్య సదస్సు నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీవీ రమణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం తమిళనాడు, బిహారు రాష్ట్రాలలో కరుణానిధి, కర్పూరి ఠాగూర్ వంటి నాయీ బ్రాహ్మణులు ముఖ్యమంత్రులుగా పాలన అందించారని చెప్పారు. కార్యక్రమంలో బహుజన నాయకులు ఆకురాతి మురళీకృష్ణ, రాష్ట్ర కళాకారుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల ఎల్లమందరావు, బీసీ మహాజన సభ రాష్ట్ర అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డి.సూరిబాబు, రాష్ట్ర కళాకారుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల యలమందరావు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు పిల్లుట్ల మోహన్ రావు, పిల్లుట్ల సుధాకర్, నవ నిర్మాణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాము, పిల్లుట్ల ఆనంద్ పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా ఆటో నడిపితే చర్యలు



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నిసార్ బాషా, సిబ్బంది

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. లైసెన్సులు లేకుండా ఆటో నడపడం, మైనర్లు ఆటోలు నడుపుతున్నట్లు గుర్తించిన పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నాజ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, కాకాని రోడ్డు, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, హిమని కూల్ డ్రింగ్ సెంటర్, ఎత్తురోడ్డు, లాంచస్టర్ రోడ్డులో ట్రాఫిక్ సీఐ నిసార్‌బాషా నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్ జరిగింది. ఈసందర్భంగా నిసార్ బాషా మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సు లేకుండా ఆటో నడిపితే ఉపేక్షించమన్నారు. మైనర్లు వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని, మైనర్లు వాహనాలు నడిపితే సంబంధిత యజమానులపై కేసు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి ప్రతిజ్ఞ చేయించారు. యజమానులు సైతం లైసెన్సులు లేనివారికి ఆటో అద్దెకు ఇవ్వకూడదని సూచించారు. 45 ఆటోలు సీజ్ చేసి రూ.53,500 జరిమానాలు విధించారు. స్పెషల్‌డ్రైవ్‌లో ఎస్ఐలు హరిబాబు, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాజీబాబా దర్గాలో కానుకల లెక్కింపు ప్రారంభం

పెదకాకాని: బాజీబాబా దర్గాలో హుండీల్లో కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం హుండీలు తెరిచారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డెప్యూటీ సెక్రటరీ, టీం ఇన్‌చార్జి షేక్ నూర్‌సాహెబ్ పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్గాలో మొత్తం 6 హుండీలు ఉండగా ఉదయం 9:30 గంటలకు 2 హుండీలను పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో తెరిచి లెక్కింపు చేపట్టారు. ఈ లెక్కింపు కార్యక్రమం సాయంత్రం వరకూ కొనసాగింది. రెండు హుండీల ద్వారా రూ.10,88,020 లభించినట్టు దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. మిగిలిన నాలుగు హుండీలను బుధవారం లెక్కించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సూపరింటెండెంట్ సయ్యద్ రౌఫ్, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల నంబరింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

జీబీఏ ఎన్నికల్లో ప్రెసిడెంట్ అభ్యర్థి కాసు వెంకటరెడ్డి



ఎన్నికల ప్రచారంలో కాసు వెంకటరెడ్డి

గుంటూరు లీగల్: సివిల్, ఎన్ఐ యాక్ట్ కేసుల్లో నంబరింగ్ విషయంలో న్యాయవాదులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సహకారంతో ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రెసిడెంట్ అభ్యర్థి కాసు వెంకటరెడ్డి తెలిపారు. 2023-24 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఏర్పాటుకు సంబంధించిన గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 31న జరగనున్న నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థుల పరిచయ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ఎన్నికల అధికారి దావులూరి శామ్యూల్ జాన్ అధ్యక్షత వహించారు. కాసు వెంకటరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులకు సీఏలు సత్వరమే అందేలా ప్రయత్నిస్తానని చెప్పారు. జీబీఏ ఏర్పడి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ ఏడాది జరిగే ప్రతి వేడుకలను అందరి న్యాయవాదుల సహకారంతో ఘనంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. మహిళా న్యాయవాదులకు మరొక వెయిటింగ్ హాలు నిర్మించాలని భావిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, పోకల వెంకటేశ్వరరావు, సోమసాని ఝాన్సీలక్ష్మి, వజ్రాల రాజశేఖరరెడ్డి, రమణారెడ్డి, సాగర్, సిరాజుద్దీన్, మాతంగి శ్రీకాంత్, సూరిబాబు, సీహెచ్‌వీ సత్యనారాయణ, స్టాలిన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

23 మొబైల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత



మొబైల్‌ఫోన్లను అప్పగించిన ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పక్కన ఏఎస్పీలు సుప్రజ, శ్రీనివాసరావు

నగరంపాలెం: ఒకట్రెండు కాదు..మూడేళ్ల క్రితం పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను కూడా గుంటూరు పోలీసులు గుర్తిస్తున్నారు. అనంతరం పోగొట్టుకున్న బాధితులకు అప్పగిస్తున్నారు. 'హాయ్' అని పంపించే ఒక మేసేజ్‌తో దర్యాప్తు చేపట్టి, తిరిగి మొబైల్‌ఫోన్లను అప్పగించడంపై బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మంగళవారం మరో 23 మందికి మొబైల్‌ఫోన్లను అప్పగించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ బాధితులకు మొబైల్‌ఫోన్లను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం ఈ ఏడాది జనవరి 28న వాట్సాప్ నంబర్ 8688831574ను అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. ఈ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన రోజుల వ్యవధిలో పలు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఫిర్యాదులకు అనుగుణంగా గుంటూరు ఐటీ కోర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారని అన్నారు. ఈ క్రమంలో పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను ట్రాక్ చేసి గుర్తించారని చెప్పారు. ఇప్పటివరకు ఎక్కువ సంఖ్యలో మొబైల్‌ఫోన్లను అప్పగించినట్లు గుర్తు చేశారు. పాత మొబైల్‌ఫోన్లను తిరిగి అప్పగించడంపై బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వాట్సాప్ నోడల్ అధికారిణి, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గిస్తే ఉద్యమిస్తాం

– సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

గుంటూరు వెస్ట్: ఆంధ్ర రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్ట్ విషయంలో వైఎస్సార్ సీపీ, బీజేపీలది ఒకే విధమైన రాజకీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సామూహిక నిరాహారదీక్షలు చేపట్టారు. వీటిని ప్రారంభించిన నారాయణ మాట్లాడుతూ పోలవరం ఎత్తు తగ్గించేందుకు ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. పోలవరం ఎత్తు తగ్గితే దిగువ ప్రాంతాలతోపాటు, పవర్ ప్రాజెక్టులకు నీరు అందదని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, పాశం రామారావు, షేక్ మస్తాన్‌వలి, పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో పాత వాహనాలు దగ్ధం

గుంటూరు ఈస్ట్: జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో రెండు పాత వాహనాలు పూర్తిగా కాలిపోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎంటీ సెక్షన్ పార్కింగ్ ప్లేస్‌లోని పాత వాహనాలు టాటా సుమో, కమాండర్ జీపులు మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయాయి. గమనించిన సిబ్బంది ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఎంటీ సెక్షన్ ఇన్‌చార్జి జె.రాజారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారం అభినందనీయం



నగరంపాలెం: సామాజిక బాధ్యతలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో రూ.3 లక్షల విలువైన 30 బారికేడ్స్‌ను మంగళవారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌కు ఎమ్మెల్సీ అందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బారికేడ్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. బ్యాంక్ ప్రాంతీయ అధికారి బి.అమర్‌నాథ్ రెడ్డి, ఆర్‌బీడీఎస్ ఎస్‌బీ సుధాకర్, కన్సల్టెన్సీ విభాగపు ఇన్‌చార్జి రాజపూడి శ్రీకాంత్, ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు పాల్గొన్నారు.

బీజేపీ గుంటూరు 'పశ్చిమ' కన్వీనర్‌గా తోట రామకృష్ణ



గుంటూరు మెడికల్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్‌గా బీజేపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు తోట రామకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు అసెంబ్లీ కన్వీనర్లను మంగళవారం నియమించారు. తోట రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



గుంటూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని 40వ డివిజన్ పెదపలకలూరు కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల దత్తత గ్రామం పెదపలకలూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం తదితర విషయాలపై వివరించారు. ప్రధాన కూడళ్లలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

అనుబంధాలను చాటి చెప్పిన 'నెక్స్‌జెన్ కిడ్స్'



గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్ 4వ లైనులోని కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ పాఠశాల 9వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా బంధన్ శీర్షికతో చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి పలు ప్రదర్శనలు ఇచ్చారు. తల్లి, తండ్రి గురువు, గ్రాండ్ పేరెంట్స్, అత్తయ్య, మావయ్య, కోడలు, బావా, మరదలు, భార్య భర్త, స్నేహితుడు మొదలైన బంధాలను వివరిస్తూ చేసిన ప్రదర్శనలు అతిథులను అలరించాయి. ఈసందర్భంగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యతో పాటు వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నెక్స్‌జెన్ కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధీర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి యాక్షన్‌ప్లాన్

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో లే అవుట్ల వారీగా నోడల్, హౌసింగ్ అధికారులు ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత లే అవుట్ల వారీగా ఇళ్ల నిర్మాణం ఏ మేరకు పూర్తి అయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్లుల చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి లే అవుట్ నుంచి కాంట్రాక్టర్ ప్రతి రోజు నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. లే అవుట్‌ల వారీగా ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని, ఏ సమస్య ఎదురైనా అధికారులు సమన్వయంతో పరిష్కరించి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లే అవుట్‌లలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందర్‌రామిరెడ్డి, కొండారెడ్డి, హౌసింగ్ ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

తృణధాన్యాల ఆహారం శ్రేయస్కరం

బీహెచ్ కళాశాలలో మిల్లెట్స్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న బొల్లాప్రగడ శ్రీదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: తృణధాన్యాల ఆహారం శ్రేయస్కరమని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి జాతీయ కార్యవర్గ సభ్యురాలు బొల్లాప్రగడ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో మిల్లెట్స్ ఆహారం పై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న శ్రీదేవి మాట్లాడుతూ బియ్యం ఉత్పత్తులకు ముందుగా శతాబ్దాలు పాటు తృణధాన్యాలతో ఆహారం తీసుకున్న మనుషులు పూర్తి శారీరక దారుఢ్యంతో ఉండేవారని తెలిపారు. ప్రస్తుత వ్యవసాయ ఉత్పత్తులన్నీ రసాయనాలతో అందుతున్నాయని, వాటిని తినడం ద్వారా అనేక రకాల రోగాల బారిన పడి ఆసుపత్రుల ఖర్చులకోసం జీవితాలను తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుధాన్యాల వ్యవసాయంలో నీరు, శ్రమ, పెట్టుబడి అతి తక్కువగా ఉంటుందని చెప్పారు. ఔషధాలు ఆహారం కాకుండా ఆహారమే ఔషధంగా మారే విధానం తృణధాన్యాలతో సాధ్యమన్నారు. పరిశుద్ధమైన ఆహారం, నీరు ద్వారానే పూర్తి ఆరోగ్యం చేకూరుతుందటంలో ఏమాత్రం సందేహం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయంతో పాటు చిరుధాన్యాల ఆహారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా అంతర్జాతీయంగా 2023 సంవత్సరాన్ని 'ఇంటర్నేషనల్ మిల్లెట్స్ ఇయర్' గా ప్రకటించిందన్నారు. జిల్లా ఆయుష్ విభాగ వైద్యురాలు ఉమా సుందరి మాట్లాడుతూ రాగులు, సజ్జలు, జొన్నలు, అరికెలు, సామలు వంటి చిరుధాన్యాలతో వండే ఆహారం తీసుకోవడం వల్ల సులువుగా అరుగుదలతో పాటు శరీరానికి కావలసిన పోషక పదార్థాలన్నీ సమకూరుతాయన్నారు. చిరుధాన్యాల ఆహారం ద్వారానే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. రక్తహీనతతో ఇబ్బంది పడే విద్యార్థినులు, మహిళలు తృణధాన్యాల ఆహార ఉత్పత్తులను తయారు చేసుకోవడం, తినడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. సేమ్యాలు, నూడిల్స్, ఫాస్ట్ ఫుడ్స్, కేకులు, బర్గర్లు వంటి యువత ఇష్టపడే పదార్థాలు మిల్లెట్స్ ద్వారా తయారు చేసుకోవచ్చునని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చిరుధాన్యాలతో తయారుచేసిన బిస్కెట్లు, రాగి జావ అందించారు. సోషల్ ఇంజినీర్ మన్నవ హనుమ ప్రసాద్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తాడువాయి నాగరామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కౌసల్యాదేవి, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి యు.గిరిజ, ఎస్వీ పద్మజ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్స్ వినీత, శివప్రసాద్, డీన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో జరిగిన ఐఎన్‌టీఎస్ఓ ఒలింపియాడ్ ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్స్ విద్యార్థులు తిరుగులేని విజయం నమోదు చేశారని శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య తెలిపారు. రింగ్‌రోడ్డులోని స్కూల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు జరిగిన ఐఎన్‌టీఎస్ఓ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య తిరుగులేని ఆధిపత్యాన్ని చాటిందని చెప్పారు. గుంటూరు జోన్ నుంచి అత్యధికంగా ఐదుగురు విద్యార్థులు ల్యాప్‌ట్యాప్స్‌ను గ్రాండ్ ప్రైజ్‌లుగా సాధించడంతో పాటు 34 మంది విద్యార్థులు ట్యాబ్స్ సాధించినట్లు వివరించారు. అదేవిధంగా 172 మంది విద్యార్థులు టాప్-5 ర్యాంకులను, 4,176 మంది విద్యార్థులు మెడల్స్ పొందినట్లు తెలిపారు. శ్రీచైతన్య స్కూల్స్ మెడికాన్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టమ్, అంకితభావంతో పని చేస్తున్న ఉపాధ్యాయులే కారణమని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సీమ అభినందించారు. ప్రిన్సిపాల్స్ వినీత, శివప్రసాద్, డీన్లు అమర్‌నాథ్, కేజీఎస్ ప్రసాద్, శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

'అంతరిక్ష పరిశోధనల్లో ప్రథమస్థానంలో దేశం'

గుంటూరు ఎడ్యుకేషన్: అనితర సాధ్యమైన అంతరిక్ష ప్రయోగాలను విజయవంతంగా నిర్వహిస్తున్న భారతదేశం అంతరిక్ష పరిశోధనల్లో ప్రథమస్థానంలో నిలిచిందని హిందూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎం ప్రసాద్ తెలిపారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీహరికోటలోని షార్ నుంచి 5,805 కిలోల బరువు గల 36 ఉపగ్రహాలను వన్ ఇండియా వెబ్-2 పేరుతో ఇస్రో చేసిన వాణిజ్య ప్రయోగం విజయవంతమైన సందర్భంగా శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ సమాచార వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావడంలో ఇస్రో చేస్తున్న ప్రయోగాలు దేశానికి ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చుతున్నాయని తెలిపారు. ఈసందర్భంగా పీజీ విద్యార్థిని గౌతమి రాకెట్ వ్యవస్థపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆకట్టుకుంది.కళాశాల యూజీ, పీజీ విభాగాధిపతులు పీవీ రాము, కె.శరత్ కుమార్, అధ్యాపకులు లలిత, ప్రసాద్, కళ్యాణి, రేణుక, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

'చలపతి'లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గుంటూరు మెడికల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒకరు చేసే రక్తదానంతో నలుగురికి ప్రాణదానం చేయవచ్చని డాక్టర్ కొత్తమాసు దినేష్ అన్నారు. మంగళవారం సూట్స్ కేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో మోతడక చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం జరిగాయి. రక్తదాన శిబిరానికి, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని చలపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రంగారావు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానానికి మించినది మరొకటి లేదన్నారు. ఈ మెడికల్ క్యాంపు ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బ్లడ్ గ్రూప్ తెలియచేయటంతో పాటుగా మెడికల్ చెకప్ చేసినట్లు వెల్లడించారు. వైద్య శిబిరంలో డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ లోకేష్, డాక్టర్ కార్తీక్, కళాశాల సెక్రటరీ వై.సుజిత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్.అరుణ, సూట్స్ కేర్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ డైరెక్టర్స్ సి.హెచ్.కార్తీక్, వై.వెంకట్, ఎం.రాజా పాల్గొన్నారు.